సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం । 13 । ఆగస్టు । 2025

'మా ఓట్లు గల్లంతయ్యాయంటూ... ఓటర్లు వీధుల్లోకి వచ్చి ప్రశ్నిస్తుంటే .. సమాధానం చెప్పేవారు ఎవరు. 'మా ఓట్లు ఎవరో వేశారంటా' పోలింగ్ కేంద్రం సాక్షిగా నిల బడి సాక్ష్యాలు చూపిస్తుంటే .. జవాబు చెప్పేదెవరు.. పోలీసులే దగ్గరుండి మరీ రిగ్గింగ్ చేయిస్తుంటే.. అడ్డుకునేదెవరు..అడ్డు చెప్పేదెవరు... దొంగ ఓట్లు వేసినోళ్లే పబ్లిగ్గా సెల్ఫీ దిగీ మరి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే.. రాజ్యాంగాన్ని కాపాడేదెవరు.. ఈసీ స్పందిస్తుందా.. కోర్టు సుమోటోగా తీసుకుంటుందా.. చూడాలి.

డీఐజీ.. ఎస్పీ.. ఇవి హోదాలు కాదు.. ఒంటిపై వేసుకున్న యూనిఫాంలోని స్టార్లు.. బ్యాడ్జీలే అస్సలు కాదు.. సమాజానికి ఆదర్శం వీరు.. ఉన్నతోద్యోగులు వీరు.. ఉన్నత చదువులు చదివిన వారు. రేపటి తరానికి స్ఫూర్తిగా నిలవాల్సింది పోయి... 'మచ్చగా' మిగిలిపోతున్నారు. వీరే ఇలా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుంటే.. పచ్చ నేతల మోచేతి నీళ్లు తాగుతుంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేదెవరు. యువత వీరిని ఆదర్శంగా తీసుకుంటే.. దేశ భవిష్యత్తు ఏమవునో.. ప్రస్తుత యువతరం ముందెన్నడూ చూడని ఎన్నిక ఇది. ఇకపై చూడకూడని ఎన్నిక కూడా ఇదే.

సత్యం వధ.. ధర్మం చెర

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో పరిహాసమైన ప్రజాస్వామ్యం.. బరితెగించిన పచ్చ మూక.. పులివెందులలో దొంగ ఓట్ల జాతర


కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తరలింపును అడ్డుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


కనంపల్లె సర్పంచ్ ఇంటి వద్ద గన్ను పెట్టిన పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు.. కంచే చేను మేసిందన్న నానుడిని పోలీసు శాఖ రుజువు చేసిన రోజు.. అధికార పార్టీకి తొత్తుగా మారి.. కాదు కాదు ఆంక్షల సంకెళ్లలో బందీగా మారి పూర్తి బానిసగా మారిన రోజు.. అవును.. కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైంది. పులివెందులలో అడుగడుగునా రౌడీ రాజ్యం కనిపిస్తే.. ఒంటిమిట్టలో పచ్చ మూక బరితెగించింది.

- ఇంకా తెలవారకముందే.. సూరీడు కిరణాలైనా పడకముందే పులివెందుల పల్లెల్లో డబ్ డబ్ మంటూ ఖాకీల అడుగు చప్పుళ్లు వినిపించాయి. బందోబస్తుకు కాదు.. బందిపోట్లకు అండగా నిలవాలన్న తాపత్రయంతో వేసిన అడుగులవి. దొంగ ఓట్లను అరికట్టడానికి కాదు.. నిజమైన ఓటర్లను అడ్డుకోవడానికి వేసిన అడుగులవి. పచ్చని పల్లెల్ని పచ్చ స్వామ్యంగా మార్చాలనే కుట్రలో భాగంగా వేసిన అడుగులవి. ఇందులో భాగంగానే స్థానిక వాసి.. ప్రజా ప్రతినిధి.. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ వైఎస్ అవినాష్ రెడ్డి ఇంటికొచ్చారు. ఎన్నికల వేళ నేతల్ని 'ఇంటి నిర్బంధం' చేయడం సహజమే. కానీ ఇంట్లోనే ఉంటానన్న ఎంపీ వినతిని పట్టించుకోలేదు.. ఒంట్లో నలతగా ఉందన్నా కనికరించలేదు.. బలవంతపు అరెస్టు చేసి సగం జిల్లా తిప్పారు. పోనీ అధికార పార్టీ నేతల్ని చేశారా అంటే అబ్బే అస్సలు పట్టించుకోలేదు. పైగా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది ఓట్ల దొంగల్ని దగ్గరుండి స్వాగతం పలికారు. కమలాపురం మండలం పెద్ద చెప్పలి ఎక్కడుంది.. పులివెందుల మండలంలోని ఎర్రిపల్లె ఎక్కడుంది... అక్కడి నుంచి వచ్చి ఏంచక్కా ఓట్లు వేస్తుంటే పోలీసులు చూస్తూ ఉండిపోయారు. అంతేనా వేంపల్లె నుంచి.. జమ్మలమడుగు నుంచి.. ఎర్రగుంట్ల నుంచి.. ఇలా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రౌడీల్ని.. పచ్చ మూకల్ని తరలించి మరీ ఓట్లేయించారు. సాక్షాత్తు డీఐజీ, ఎస్పీ, డీఎస్పీ.. ఇలా పోలీసు బాసులందరూ తిష్ట వేసింది దీనికో సమే. ఈ అరాచకాలకు..అక్రమాలకు.. పోలీసు ఉన్నతాధికారులందరూ సాక్ష్యమే.

- ఇక సాక్షాత్తు వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్ రెడ్డి ఇంటిని ఉదయాన్నే చుట్టుముట్టిన పోలీసులు కొన్ని గంటల వరకు బయటికి రాకుండా అడ్డుకున్నారు. పోలింగు బూతుల్లో దొంగ ఓట్ల జాతర ముగిశాక తీరిగ్గా ఓటు వేయడానికి రమ్మని అడిగారు. అప్పటికే నిండా ఆక్రోశంతో ఉన్న మహిళలు పోలీసుల తీరును తూర్పారబట్టారు. ఏజెంట్లు లేకుండా ఇంత సేపు దొంగ ఓట్లు వేసుకుని ఇప్పుడొచ్చి రమ్మంటారా అంటూ ఖాకీల్ని నిలదీశారు. జవాబు చెప్పలేక.. అక్కడి జనాల్లో ఉండలేక కాళ్లకు పని చెప్పడం పోలీసుల వంతైంది.

- ఎర్రిపల్లెలో సుమారు 350 మంది పచ్చ మూక బరితెగిస్తుంటే ఖాకీ సైన్యం చోద్యం చూస్తూ నిలబడింది. ఆడోళ్లని కూడా చూడకుండా పచ్చ మూకలు దౌర్జన్యం చేస్తుంటే అడ్డు చెప్పే ధైర్యం కూడా వారిలో లేకుండా పోయింది. పోలీసుల ఒంటిపై ఖాకీ యూనిఫాం కనిపిస్తున్నా .. లోన వేసుకున్న 'పచ్చ చొక్కాల లెక్క' డామినేట్ చేసింది. పబ్లిగ్గా అది సాక్షాత్కరమైంది కూడా.


పులివెందులలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి దండయాత్రగా వచ్చిన పోలీసులు


తుమ్మలపల్లెలో పోలీసులపై తిరగబడుతున్న మహిళలు


తుమ్మలపల్లెలో కట్టెలు పట్టుకుని ఉన్న టీడీపీ మూకలు


టీడీపీ, పోలీసులు అడ్డుకొని తమ ఓట్లు వాళ్లే వేసుకున్నారని ఎంపీని కలిసేందుకు వచ్చిన మహిళా ఓటర్లు

పులివెందులలో విష సంస్కృతికి బీజం

- పల్లెలపై పడ్డ పచ్చ మంద
- భయభ్రాంతులకు గురైన ఓటర్లు
- ఏజెంట్ల ఫారాలు చించివేత
- టీడీపీ అల్లరి మూకల భయానక పరిస్థితుల మధ్య ఎన్నికలు
- చోద్యం చూసిన పోలీసు యంత్రాంగం


అచ్చివెళ్లి వద్ద నిరసన తెలుపుతున్న మహిళా ఓటర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో విష సంస్కృతికి బీజం పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నిక జరిగింది. వేలాది మంది టీడీపీ అల్లరి మూకలవల్ల ఓటర్లు, ఏజెంట్లు భయభ్రాంతులకు గురయ్యారు. పులివెందుల జెడ్పీటీసీ పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లి పోలింగ్ బూత్‌లను మంగళవారం టీడీపీ మూకలు ఆక్రమించుకున్నారు. అలాగే టీడీపీ నాయకులు ఎక్కడికక్కడ సాక్షి వాహనాన్ని చుట్టుముట్టి వాహనాన్ని బాది తాళాలు లాక్కొన్నారు., చొక్కా పట్టి కిందకు దించే ప్రయత్నం చేశారు. కొత్తపల్లిలో 'సాక్షి' మీడియా వాహనాలు ధ్వంసం చేశారు. ఎర్రిపల్లె, కొత్తపల్లెల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనంద్‌పై టీడీపీ అల్లరి మూకల దాడి చేశారు. తుమ్మలపల్లె, కనంపల్లెలలో కట్టెలు పట్టుకుని టీడీపీ మూకలు గొడవలు చేశారు. తుమ్మలపల్లెలో షామియానా వేసి టిఫిన్, భోజనాలు ఏర్పాటు చేశారు. అచ్చివెళ్లిలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను టీడీపీ నాయకులు అడ్డుకున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. మోటున్నూతలపల్లెలో టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ వాహనాలను ధ్వంసం చేశారు. కొత్తపల్లె, నల్లగొండువారిపల్లె, తుమ్మలపల్లె పోలింగ్ బూత్‌లలోకి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అనుమతించకుండా ఆక్రమించుకున్నారు. ఎర్రిపల్లెలో పోలింగ్ బూత్‌ను ఆధీనంలోకి తీసుకుని ప్రజలు వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులను సైతం తరిమేస్తూ.. ఊర్లో మహిళలపై దాడి, అసభ్యంగా ప్రవర్తించారు. గ్రామంలో ఎవరూ ఓటు వేయకుండా అడ్డుకున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి నాయకుల అనుచరుల హల్‌చల్

నల్లపురెడ్డిపల్లెలో పోలింగ్ కేంద్రం వద్ద జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు హల్‌చల్ చేశారు. ఉదయం నుంచే బూత్‌లను అధికార పార్టీ నేతలు ఆక్రమించుకుని వైఎస్సార్‌సీపీకి చెందిన ఏజెంట్లను కూర్చోనివ్వలేదు. టీడీపీ గూండాలు ఏజెంట్ల ఫారాలను లాక్కొన్నారు. మోటున్నూతలపల్లిలో దారిని టీడీపీ అల్లరి మూకలు అడ్డగించి పోలింగ్ బూత్ కి 2 కిలో మీటర్లు ముందే వాహనాలు అపి కొట్టి వారు ఊరి బయటే వాహనాలను వెనక్కి పంపారు. కనంపల్లెలో టిడిపి అల్లరి మూకల మహిళా ఓటర్లపై దాడులు చేశారు. కనంపల్లెలో ఓటు వేయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనంపల్లె సర్పంచ్ రామాంజనేయులు ఇంటి వద్ద మంచంపై పోలీసులు గన్ను పెట్టి బెదిరించారు. తుమ్మలపల్లె, కనంపల్లె పోలింగ్ బూత్‌లకు వెళ్లనీయకుండా టీడీపీ మూకలు ఓటు వేయడానికి వెళుతున్న మహిళా ఓటర్లపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఎర్రిపల్లె పోలింగ్ బూత్‌లోకి ఏజెంట్లను బీటెక్ రవి తమ్ముడు భరత్ రానీయకుండా అడ్డుకుంటున్నా పోలీసులు చోద్యం చేస్తున్నారని మహిళా ఏజెంట్ వాపోయింది.

ఒంటిమిట్టలో రాయచోటి రౌడీల వీరంగం


టీడీపీ నేతల దౌర్జన్యంపై పోలీసులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్‌బాషా

సాక్షి రాయచోటి/రాజంపేట: ఒంటిమిట్టలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్‌లో రిగ్గింగ్ యథేచ్ఛగా సాగింది. మండలంలో 30 పోలింగ్ బూత్‌లు ఉంటే ప్రతి చోట పోలీసులు, ఎన్నికల సిబ్బంది సహకారం ఎల్లో గ్యాంగ్‌కు లభించింది. టీడీపీ నేతలు, కార్యకర్తలు నేరుగా పోలింగ్ బూత్‌ల్లోకి చొరబడి, ఓటర్ల నుంచి ఓటరు స్లిప్‌లు లాక్కుని వారే ఓటు వేసుకున్నారు. అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికారులు మిన్నకుండిపోయారు.

మంత్రి నేతృత్వంలోఏజెంట్లపై దాడులు

మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో టీడీపీ శ్రేణులు.. పోలింగ్ బూత్‌లలో వున్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడులు చేశారు. ప్రధానంగా మంటంపంపల్లె, చిన్నకొత్తపల్లె, గంగపేరూరు, నడింపల్లె తదితర పోలింగ్ బూత్‌లలో ఉదయం నుంచి ఏజెంట్లను బయటికి లాగి పడిసే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ సంఘటనలతో బూత్‌ల వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.


అడ్డుకోవడానికి వైఎస్సార్‌సీపీ నేతల యత్నం

సమాచారం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి, ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ గోవిందరెడ్డిలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇరగరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా పోలింగ్ బూత్ వద్దకి చేరుకున్నారు. ఆ సమయంలో టీడీపీ నేతల దౌర్జన్యానికి అడ్డుతగులుతున్నారని భావించి.. వైఎస్ఆర్‌సీపీ నేతలను అరెస్ట్ చేయాలని పోలీసులకు అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో వైఎస్ఆర్‌సీపీ నేతలను అరెస్ట్ చేసి ఒంటిమిట్ట, కడప రిమ్స్, చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

రిమ్స్‌లో ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌పై అవగాహన

కడప అర్బన్: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో ర్యాగింగ్ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించిన నేపథ్యంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున మాట్లాడుతూ ప్రతి సీనియర్ విద్యార్థి, జూనియర్‌లను సోదర–సోదరి భావంతో చూడాలన్నారు. వారిని అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. కడప వైద్య కళాశాలను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా నిలబెట్టడం అందరి బాధ్యత అన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ కోసం ర్యాగింగ్ ఘటనలకు దూరంగా ఉండి, సభ్యతతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ బయోకెమిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ లక్ష్మీనరసమ్మ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, అనస్థీషియా విభాగ అధిపతి డాక్టర్ సునీల్ చిరువెల్ల, డాక్టర్ సుబ్బరాయుడు, వైద్యులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల వేధింపులకు గురైన వ్యక్తి మృతి


చిన్న బాలయ్య మృతదేహం

కర్నూలు(హాస్పిటల్)/కొండాపురం: స్థల వివాదంలో పోలీసుల వేధింపులతో వైఎస్సార్ కడప జిల్లా కోర్టు ఆవరణలోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మంగళవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలం బుక్కపట్నం గ్రామానికి చెందిన ఆర్.చిన్నబాలయ్య(45)కు చెందిన స్థలం విషయంలో హోంగార్డులు తిరుపతయ్య, నాగార్జున రెడ్డి, కానిస్టేబుల్ నరసింహులుతో పాటు గ్రామస్తులు దత్తాపురం మాధవ రెడ్డి, గంగిరెడ్డి, తుంగ జగదీశ్వర్ రెడ్డి, బెస్త వేణు, బెస్త ప్రసాద్, మేకల బాల నారాయణరెడ్డి వేధిస్తున్నారని.. తన భార్య, పిల్లలను తనకు చూపించకుండా ఎక్కడో దాచారని అప్పట్లో ఆరోపించాడు. తనపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నట్లు పోలీసులకు తెలిపి గత నెల 29న కోర్టు ఆవరణలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే అతడికి కడప రిమ్స్‌లో ప్రాథమిక వైద్యం చేయించి అదే రోజు రాత్రి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేశారు. ఆసుపత్రిలోని కాలిన రోగుల వార్డులో 60 శాతానికి పైగా కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం కోలుకోలేక మృతిచెందాడు. దాదాపు రెండు వారాల పాటు ఎలాగైనా తనను బతికించాలని.. తన భార్య, బిడ్డలను చూపించాలని వైద్యులను వేడుకోవడం అందరినీ కలచివేసింది.

రాచమల్లు హౌస్ అరెస్టు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డిని మంగళవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసిన అనంతరం ఎర్రగుంట్లలో ధర్నా కార్యక్రమంలో ఎంపీతోపాటు రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్థానిక రూరల్ పోలీసులు ప్రొద్దుటూరు దొరసానిపల్లెలోని ఆయన స్వగృహంలో రాచమల్లును హౌస్ అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో లైన్‌మెన్ మృతి

మైదుకూరు: మైదుకూరు పట్టణ శివారులో చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారి బైపాస్‌పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సురసుర రమణయ్య (40) అనే లైన్‌మెన్ మృతి చెందాడు. ప్రొద్దుటూరులో వ్యక్తిగత పనులు ముగించుకుని బైక్‌పై మైదుకూరు సమీపంలోని గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వెళుతున్నాడు. బైపాస్ రోడ్డులోని సర్వాయిపల్లె బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న కారు – బైక్ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటనలో లైన్‌మెన్ రమణయ్య, అక్కడికక్కడే మృతి చెందాడు. బ్రహ్మంగారిమఠం మండలం నరసన్నపల్లెకు చెందిన ఈయన అదే మండలం చెంచయ్యగారిపల్లెలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య తులసి, 13 ఏళ్ల కుమారుడు రోహిత్ ఉన్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎన్‌ఆర్‌ఐలు


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గల్ఫ్ దేశాలలోని ఎన్‌ఆర్‌ఐలు కలిశారు. మంగళవారం విజయవాడ తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్లోబల్ ఎన్ఆర్ఐ కన్వీనర్ ఏ. సాంబశివ రెడ్డి ఆధ్వర్యంలో గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్‌తో కలిసి గల్ఫ్ అడ్వైజర్ నాయని మహేశ్వర్ రెడ్డి, కువైట్ కో కన్వీనర్ మన్నూర్ చంద్రశేఖర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు పులపుత్తూర్ సురేష్ కుమార్ రెడ్డి, అడ్వైజర్ అరవ సుబ్బారెడ్డి మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందన్నారు. ఏజెంట్లను లాగిపడేసి యథేచ్ఛగా రిగ్గింగ్ చేసుకున్నారన్నారు. రాజకీయ కక్షలతో వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి రాక్షసానందం పొందుతున్నారని, ఎంతో కాలం ఈ అక్రమాలు సాగవని హెచ్చరించారు.

పశుసంవర్ధకశాఖ రాష్ట్ర సంఘంలో జిల్లావాసులు


రాష్ట్రసంఘంలో చోటు లభించిన జిల్లా నాయకులను అభినందిస్తున్న ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్ రాజశేఖర్ తదితరులు

కడప అగ్రికల్చర్: విజయవాడ పశుసంవర్ధశాఖ రాష్ట్ర సంఘం ఎన్నికల్లో వైఎస్సార్ జిల్లా నుంచి ముగ్గురికి చోటు లభించింది. వేల్పులలో లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న చాంద్‌బాషాకు ఏపీ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్– వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చోటు దక్కింది. అలాగే ఊటుకూరులో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యకు ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా, ఖాజీపేట మండలం ఆంజనేయకొట్టాలులో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గంగయ్యకు ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చోటు లభించింది. మన జిల్లా నుంచి రాష్ట్ర సంఘానికి ఎన్నికైనందుకు వైయస్సార్ కడప జిల్లా తరఫున అభినందనలతోపాటు శుభాకాంక్షలు తెలియచేశారు. ఏపీ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ అండ్ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ సర్వీస్ అసోసియేషన్ నాయకులు సదాశివయ్య, విద్యాసాగర్, మనీ, వెంకటసుబ్బయ్య, సునీల్, వీరకుమార్, మహదేవ, రమేష్ , పెంచలయ్య, శ్రీనివాసులు, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

స్లిప్పులు లాక్కోవడం ఏంటి?



ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించకోలేకపోవడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేక తాలిబన్ల రాజ్యంలో ఉన్నామో అర్థం కావడం లేదు. ఎర్రిపల్లె గ్రామంలో 300 మంది టీడీపీ గూండాలు భయపెట్టారు. సోమవారం రాత్రి నుంచి గ్రామంలో తిరుగుతూ వైఎస్సార్‌సీపీకి చెందిన వారిని కత్తులు, తుపాకులతో బెదిరించారు. గ్రామంలో ఎవరినీ కూడా ఓటు వేసేందుకు వెళ్లనివ్వలేదు. స్లిప్పులు లాక్కొని మర్యాదగా వెళ్లిపోతారా.. లేక దెబ్బలు తింటారా అని హెచ్చరించారు. ఇలాంటి సంస్కృతి ఎన్నడూ చూడలేదు. –కె.రామ్మోహన్ రెడ్డి, ఎర్రిపల్లె, పులివెందుల మండలం

500 మంది టీడీపీ గూండాలు వచ్చారు



గ్రామంలోకి సోమవారం రాత్రి ఒకసారిగా 500 మంది టీడీపీ గూండాలు వచ్చారు. గ్రామంలో వీధి వీధి తిరిగారు. ఇప్పటికే గ్రామంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారు. దీంతో వారు గ్రామంలో లేకుండా వెళ్లిపోయారు. ఏజెంట్లుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరించారు. భయపడి గ్రామస్తులు ఎవరూ కూడా ఓటు వేయలేదు. ప్రజాస్వామ్యబద్ధంగా అధికారులు తిరిగి ఎన్నికలు నిర్వహించాలి. పోలీసులు టీడీపీ గూండాలకు తొత్తులుగా వ్యవహరించడం తగదు. – జి.సుధాకర్ రెడ్డి, ఎర్రిపల్లె, పులివెందుల మండలం

బీటెక్ రవి తమ్ముడు భరత్ అడ్డుకున్నాడు



ఎర్రిపల్లె పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా కూర్చొనేందుకు వెళ్లాను. బీటెక్ రవి తమ్ముడు భరత్‌కుమార్‌రెడ్డి నా వద్ద ఉన్న పత్రాలు లాక్కొని అడ్డుకున్నాడు. ఇతనితో పాటు పోలీసులు కూడా ఇక్కడి నుంచి వెళ్లిపొమ్మన్నారు. ఇలాంటప్పుడు ఎన్నికలు ఎందుకు నిర్వహించాలి? పోలీసులు వారి డ్యూటీ చేయకుండా టీడీపీ గూండాలకు కాపలాగా ఉన్నారు. గ్రామంలో ఏ ఒక్కరినీ ఓటు వేయనీయలేదు. – గంగా భవాని, ఎర్రిపల్లె, పులివెందుల మండలం

వైఎస్సార్‌సీపీ అంటే స్లిప్పులు లాక్కున్నారు



కొత్తపల్లె పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌గా నిలబడటానికి వెళితే ఏజెంట్ పత్రాలను చించివేశారు. ఓటు వేయడానికి వెళ్లిన వారిని ఏ పార్టీకి చెందిన వారని అడుగుతున్నారు. వైఎస్సార్‌సీపీ అంటే స్లిప్పులు లాక్కొని వెనక్కు పంపిస్తున్నారు. గ్రామంలో ఇదేవిధంగా ప్రజల స్లిప్పులను తీసుకుని వారే ఓటింగ్ వేసేలా చేసుకున్నారు. రిగ్గింగ్ పక్కాగా జరిగింది. ఇంటింటికి వెళ్లి బెదిరింపులతో ఓటర్ల స్లిప్పులను తీసుకెళ్లారు. – పి.సాయికుమార్, చంద్రగిరి, పులివెందుల మండలం

న్యూస్‌రీల్

కడపలో భారీ వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వారం రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కడపలో అత్యధికంగా 28.4 మి.మీ వర్షం కురిసింది. అలాగే ఖాజీపేటలో 22.4, దువ్వూరులో 21.8 , రాజుపాలెంలో 19.8, చెన్నూరులో 15.2 , వల్లూరులో 11.8 , కమలాపురంలో 9.6 , సిద్ధవటంలో 9.2 , సికెదిన్నెలో 8.6 , బి కోడూరులో 8 , జమ్మలమడుగులో 6.2 , ప్రొద్దుటూరులో 6 , మైలవరంలో 4.6 , పులివెందుల్లో 4.4 , కొండాపురంలో 4.2 ,బి.మఠంలో 3.8 , మైదుకూరులో 3.4 , ముద్దనూరులో 3.2 , గోపవరంలో 3 , చాపాడు, పోరుమామిళ్లలలో 2.8 మి.మీ వర్షం కురిసింది.

ఎరచ్రందనం కేసులో ఏడాది జైలు

తిరుపతి లీగల్: ఎరచ్రందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో వైఎస్ఆర్ కడప జిల్లా ఖాజీపేట మండలం, పత్తూరు దళితవాడకు చెందిన మద్దెల దేవదాసుకు ఏడాది జైలు శిక్ష, పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచ్రందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2011 సంవత్సరంలో ప్రొద్దుటూరు రేంజ్ , కడప ఫ్లయింగ్ స్క్వాడ్ ఫారెస్ట్ సిబ్బంది ఖాజీపేట తెలుగు గంగ ప్రాజెక్టు కెనాల్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు దేవదాసు 1561 కిలోల 71 ఎరచ్రందనం దుంగలను తరలిస్తూ ఫారెస్ట్ సిబ్బందికి పట్టుబడ్డాడు. ఫారెస్ట్ సిబ్బంది అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.